# ప్రేమలేఖ

-పులిగడ్డ సుగుణ

సాయంత్రం ఏడవుతోంది. పక్షులు గూళ్లకు హడావిడిగా చేరుకుంటు న్నాయి. అప్పుడే ట్యూషన్ వదిలారు. నవ్వుతూ, తుళ్ళుతూ బయటికి వస్తున్నారు విద్యార్థులు. జంటలు జంటలుగా గుంపులు గుంపులుగా హాయిగా ఎగిరే పక్షులులాగా తిరుగుతున్నారు. కమల, రమ ఇద్దరూ కలిసి ఇంటి వైపు నడుస్తున్నారు. రమ ఇల్లు రాగానే కమలకి టాటా చెప్పి ఇంట్లోకి తుర్రుమంది. కమల వాళ్ళిల్లు రమా వాళ్లింటికి పదిళ్ళ తరువాత.

కమల నడుస్తూంది. ఇంతలో ప్రసాద్ వచ్చి కమలకి ఎదురుగా నిలబడ్డాడు. మొహమాటంగా నవ్వింది. జేబులోంచి గులాబీ రంగు కాగితం తీసి చేతిలో పెట్టాడు. "ఏమిటిది?" అంది ఆశ్చర్యంగా.

"నా హృదయం. చదువు నీకే తెలుస్తుంది. రేపు సాయంత్రం పార్కులో నీకోసం ఎదురు చూస్తూ ఉంటాను. ట్యూషన్ అయిపోగానే వస్తా వుగా రాకపోతే... ఏంలేదులే ఉత్తరం చదువు నీకే తెలుస్తుంది" అని వడివడిగా నడుచుకుంటూ వెళ్లి పోయాడు. కమల అప్పటికి తేరుకుంది. ఏదేదో ఆలోచనలతో ఇంట్లో అడుగుపెట్టింది. రవి కాలు అడ్డం పెట్టాడు. తూలబోయి తమాయించు కుంది. నెత్తిమీద మొడుతూ అన్నాడు.

"అందుకే కమ్మీ కళ్ళు నెత్తిమీద పెట్టుకు నడవ ద్దనేది" అన్నాడు.

బుస్సుమని పైకి లేచింది. "ఏయ్ నీకెన్నిసార్లు చెప్పాలి నన్ను కమ్మీ గిమ్మీ అని పిలవద్దని" అంది.

రవి కమల అన్నయ్య. ఒక ఏడాది కమలకంటే పెద్దవాడు. కమలకి ఎప్పుడెప్పుడు ప్రసాదిచ్చిన ఉత్తరం చదువుదామా అని ఉంది. కానీ రవి ఏమో కమల వెంటే తిరుగుతున్నాడు.

చివరికి చేసేది లేక బాత్‌రూంలో కెళ్ళి ఉత్తరం తెరిచింది.

"మై డియర్ కమలా!" అని మొదలైందా ఉత్తరం.

"నేన్నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వు లేకుండా బ్రతకలేను. నాకు నువ్వు కావాలి. నువ్వు కాదంటే నేను ఆత్మహత్య చేసుకుంటాను. నేను రేపు పార్కులో వేయికళ్లతో ఎదురుచూస్తూ ఉంటాను" టూకీగా ఇదీ ఆ ఉత్తరం సారాంశం.

చదివి బాత్‌రూంలోంచి బయటికొచ్చింది.

కమల మనసు దూదిపింజలా తేలిపోతోంది. అది తనకు మొదటి లవ్‌లెటర్ మరి. ప్రసాద్ కళ్లలో మెదిలాడు. ప్రసాద్ చాలా స్మార్ట్‌గా, స్టైల్‌గా ఉంటాడు. క్లాస్‌లో అతడంటే అందరికీ క్రేజ్. రేపే మని చెప్పాలి?

"అవునని అంటావో మరి కాదని అంటావో" అని హమ్ చేస్తూ వచ్చి నిలబడ్డాడు రవి. అన్న య్యని చూడగానే కొంచెం తడబడింది కమల. 'పోనీ ఈ ఉత్తరం వీడికి చూపిస్తే అనిపించిందో నిమిషం. వెంటనే అమ్మో ఇంకేమైనా ఉందా అను కుంది కమల. వాడి ఫ్రెండ్స్‌ని తీసుకుని ప్రసాద్‌ని ఉతికి వస్తాడు. లేకపోతే కమల రేపట్నించి ట్యూషన్ మానెయ్యి అంటాడు. కొన్నిరోజులు పోయాక కాలేజ్ మానెయ్ పెళ్లి చేసేస్కో అంటాడు. అమ్మబాబోయ్ చచ్చినా చూపించకూ డదు' అనుకుంది. 'కానీ మరేం చెయ్యాలి?

రేపుప్రసాద్ ప్రపోజల్ ఒప్పుకోకపోతే సూసైడ్ చేస్కుంటానన్నాడు.

అన్నంత పనీ చేస్తే? అయినా ప్రసాద్‌కేం తక్కువ? ఎంతోమంది కాలేజ్ బ్యూటీలుండగా తన వెంట ఎందుకు పడ్తాడు. ఎస్ తను రేపుప్రసాద్ కోసం పార్కుకి వెళుతుంది' అనుకుంది కమల. వెంటనే ఎదురుతిరిగింది మనసు వద్దు వెళ్లవద్దని. ఈ ఆలోచనలతో సతమతమవుతోంది కమల.ఇంతలో కమల తల్లి కేకేసింది.

గబుక్కున ఉత్తరం పుస్తకంలో పెట్టి తల్లి దగ్గరికి పరుగెత్తింది.కమలకి మళ్లీ మళ్ళీ ఆ ఉత్తరం చదవా లనిపిస్తోంది. రవి పైనున్నాడు కదా అని పుస్తకం కోసం చూసింది. పుస్తకం కనిపించలేదు.

గుండె గుభిల్లుమంది కమలకి. అప్పుడు గుర్తొ చ్చింది కంగారులో తనా ఉత్తరం రవి పుస్తకంలో పెట్టిన సంగతి. ఒక్క పరుగుతో పైకెళ్లింది. అప్ప టికే రవి ఆ బుక్కులో ఉత్తరం తీసి చదవడం మొద లుపెట్టాడు.కమలని చూడగానే రవి "రా ఆగిపో యావేం?" అన్నాడు.

తప్పదని ఎదురుగుండా వెళ్లి కూర్చుంది రవి మొహంలో భావాలని గమనిస్తూ.

ఐదునిముషాల తర్వాత ఉత్తరం మడిచి జేబులో పెట్టుకుంటూ అన్నాడు.

"ప్రసాద్ అంటే ఎవరు కమ్మీ? నాకు తెలుసా నేను చూశానా" అని.

"మీ క్లాస్‌లో నీతో ఉంది చూడు వాళ్ల తమ్ముడు" అంది భయంగా.

"ఓ నీతూ తమ్ముడా. సరే రేపు పార్క్‌కి వెళ్త న్నావా?" అన్నాడు.

అంతే కమల కళ్లల్లోంచి నీళ్ళు బొటబొటా రాలిపడ్డాయి.

"అసలు నాకేం తెలీదు. వాడే ఊర్కే నా వెంటప డ్తాడు" అంది.

రవి "ఏయ్ పిచ్చీ ఇప్పుడు నేను నిన్నేమన్నా నని. వెళ్లి చదువుకో" అన్నాడు.

కామ్‌గా అక్కడ్నించి వెళ్లిపోయింది. లోపల కమలకి భయంగానే ఉంది రేపేమౌతుందోనని.

ఆ రేపేదో రానే వచ్చింది. రవి చాలా మామూ లుగా ఉన్నాడు. కమల మామూలుగానే కాలేజీకి వెళ్లిపోయింది. కాలేజీ నుంచి వచ్చాక ట్యూషన్‌కి వెళ్తుంటే "కమ్మీ" అని పిలిచాడు.

"ఏంటన్నయ్యా?" అంది.

"నువ్వు ట్యూషన్ నుంచి పార్కుకి వెళ్ళి ప్రసా ద్‌ని మాటల్లో పెట్టు. నేను తర్వాత వస్తాను" అన్నాడు.

ముందు ఆశ్చర్యపోయింది. తర్వాత "సరే" అంది. ట్యూషన్ వదలగానే కమల పక్కనే ఉన్న పార్కుకి వెళ్లింది. కమలని చూడగానే ప్రసాద్ ముఖం చాటంతయ్యింది. కమల ప్రసాద్ దగ్గరికి వెళ్లి పక్కనే గడ్డిలో కూర్చుంది.

కమలకి ఏం మాట్లాడాలో అర్థంకాలేదు.

"చాలా థ్యాంక్స్ కమలా. నువ్వొస్తావో లేదో అని ఎంత కంగారుపడ్డానో తెలుసా?" అన్నాడు ప్రసాద్. జవాబుగా నవ్వి ఊరుకుంది.

ప్రసాద్ ఏదేదో మాట్లాడుతూనే ఉన్నాడు కానీ కమల బుర్రలోకెక్కట్లేదు. ఇంతలో రవి ఎవరో అమ్మాయితో వచ్చి వాళ్లకి దూరంగా కూర్చు న్నాడు.

"ఎవరదీ నీతలా ఉందే నీతే కదూ" లోపల

అనుకున్నానని బయటికే అనేసింది కమల.

నాలిక్కరుచుకుని ప్రసాద్ వైపు చూసింది. ప్రసాద్ రవిని, నీతనే చూస్తున్నాడు. వాళ్లిద్దరూ దగ్గరగా కూర్చుని పడి పడి నవ్వుతున్నారు. ప్రసాద్ ముఖం ఎర్రగా అయిపోయింది.

రానురాను రవి, నీతాలు మరీ అతిగా ప్రవర్తించడంతో ప్రసాద్ కోపంగా వెళ్లి వాళ్ల ముందు నిలబడ్డాడు.

"అరే ప్రసాద్! కమల కూడా వచ్చిందే. కూర్చోండి" అంది నీత.

చేసేదిలేక ఇద్దరూ కూర్చున్నారు. "మమ్మల్ని చూసి కోపం వచ్చింది కదూ" అన్నాడు రవి.

ప్రసాద్ ఏం మాట్లాడలేదు.

"మరి కమలకి నువ్వు లవ్‌లెటర్ ఇచ్చినందుకు నాకెంత కోపం రావాలి చెప్పు" అన్నాడు రవి. ప్రసాద్ ఈసారి తలకిందికి దించుకున్నాడు.

"చూడు ప్రసాద్ నీకెంతో జీవితం ముందుంది. జీవితమంటే ఏమిటో పూర్తిగా తెలీని వయసు మనది. మన ముందు ముందు జీవితం ఎలా ఉంటుందనేది ఈ విద్యార్థి దశ మీదే ఆధారపడి ఉంటుంది. కమల పార్కుకి రాకపోతే సూసైడ్ చేస్కుంటానంటున్నావ్ బాగుంది. కానీ దానివల్ల ఎవరికీ నష్టం. మహా అయితే కమల నీ గురించి నెలో రెండు నెల్లో బాధపడుతుంది. తర్వాత దాని చదువులో అది పడిపోతుంది. నువ్వీ ఆలోచన చేసేముందు కనీసం ఒక్కసారి అయినా నీ కన్నవాళ్ళ గురించి, నీతా గురించి ఆలోచించావా?" అన్నాడు.

"అయినా చూడు ప్రసాద్ ప్రేమ అనేది ప్రాణం పోసేటట్లుగా ఉండాలి గానీ ప్రాణం తీసేదిగానో, ప్రాణం తీసుకునేదిగానో ఉండకూడదు" అని గట్టిగా ఊపిరిపీల్చుకున్నాడు.

ప్రసాద్‌కి నోట్లోంచి మాట రావట్లేదు.

అపరాధభావంతో మనసు నిండిపోయింది.

"సారీ రవీ" అన్నాడు నోరు పెగల్చుకుని.

"చూడు ప్రసాద్ నువ్వెవరికీ సారీ చెప్పక్కర్లేదు. నీ తప్పు తెలుసుకుంటే చాలు. రవి స్థానంలో ఇంకెవరైనా ఉంటే నిన్ను నాలుగు పీకి ఉండేవారు. కానీ రవి ఆ పని చేయలేదు నా దగ్గరకి వచ్చి విషయం చెప్పాడు" అంది రవి అక్క నీత.

"చూడు ప్రసాద్ నువ్వు కమలని నిజంగా ప్రేమిస్తూ ఉంటే జీవితంలో నువ్వు స్థిరపడ్డాక నీకు మా ఇద్దరి సహకారం తప్పకుండా ఉంటుంది. కానీ అప్పటివరకూ మనం మంచి ఫ్రెండ్స్ అంతే" అన్నాడు రవి.

"ఓకే రవి! పదండి ఇంటికెళ్దాం" అంది నీత.

నలుగురూ ప్రశాంతచిత్తంతో ఇళ్లకి బయలుదేరారు.

★

